కోడి పందేలకు సిద్ధమవుతున్న బరులు



కోడూరు జగనన్న కాలనీ పక్కన కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరి ప్రదేశం



కోడూరు తూర్పు వైపు సిద్ధం చేస్తున్న బరి ప్రాంతం

సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలంలో కోడిపందేల నిర్వహణకు భారీస్థాయిలో బరులు సిద్ధం చేస్తున్నారు. కోడి పందేలు, జూదాలకు తావు లేదని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా నిర్వాహకులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. నరసింహపురం రోడ్డులోని జగనన్న కాలనీకి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో పందేలు వేసేందుకు అనువుగా నిర్వాహకులు శనివారం మట్టి తోలకాలు జరిపి, బరులు సిద్ధం చేస్తున్నారు. కోడూరు

క్లుప్తంగా

తెలుగులో ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయం

– ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు తెలుగులో ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయమని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నిర్ణయం వల్ల తెలుగు సంస్థలకు పునరుజ్జీవం వస్తుందన్నారు. మాతృభాషలో ప్రాథమిక విద్య ఉండాలని యునెస్కో చెప్పిందని, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల తెలుగుభాషకు పూర్వవైభవం వస్తుందన్నారు.

19న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో 19వతేదీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీ.శే తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకనీడు కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ విద్యానికేతన్ డిజటల్ స్కూల్ ఆవరణలో ఉదయం గం.9 నుంచి ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. సంబంధిత నేత్ర వైద్య పరీక్షల వివరాల కోసం మొబైల్ నంబర్లు 9490636466, 7093617778 లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో 1977–78 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి భవిరి శంకరనాథ్ శనివారం తెలిపారు. 46 సంవత్సరాల తర్వాత పదో తరగతి క్లాస్‌మేట్స్ అందరినీ ఒకే తాటి పైకి తీసుకొచ్చే ప్రయత్నంలో ఈ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామన్నారు. ఆ బ్యాచ్‌లో 134 మందిలో 14 మంది చనిపోవడంతో వందకు పైగా ఆ నాటి విద్యార్థులు సతీ సమేతంగా హాజరు అయ్యేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

నేటి నుంచి జోనల్ స్థాయి ఆటల పోటీలు

మోపిదేవి: స్థానిక మహాత్మా జ్యోతిరావ్‌బాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 5, 6 తేదీల్లో సొసైటీకి సంబంధించి జోన్–2 పరిధిలోని పాఠశాలల జోనల్ స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వీర రవి శనివారం తెలిపారు. ఈ పోటీలను అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించనున్నారని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా జిల్లాల బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

హైందవ మహాసభ జయప్రదం చేయాలి

మోపిదేవి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన విజయవాడలోని కేసరపల్లిలో నిర్వహించనున్న హైందవ మహాసభకు వేలాదిగా భక్తులు తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ కోరారు. మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని శనివారం దర్శించుకున్న అనంతరం భక్తులతో మాట్లాడుతూ హైందవ మహాసభ జయప్రదం చేయాలని, వేలాదిగా భక్తులు తరలిరావాలని కోరారు. విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పల్నాటి వెంకటస్వామినాయుడు, గరికిపాటి వీరాంజనేయులు, ఏడుకొండలు, బచ్చు శ్రీహరి, కోనూరు రామాంజనేయులు, శంకరావు, సనకా ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

నాలా లేకుండా మట్టి తోలకాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని ఆర్తమూరు గ్రామంలో 216 జాతీయ రహదారిని అనుకుని భూ బదలాయింపు చేయకుండా స్థలం మెరక చేయడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. నాలా చట్టానికి తిలోదకాలు ఇచ్చి అనుమతులు లేకుండా అడ్డగోలుగా మట్టి తోలుతున్న రెవెన్యూ అధికారులు ఉదాసీన వైఖరిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అధికారులు కళ్ల ముందే జాతీయ రహదారి పక్కన భూ బదలాయింపు చేయకుండా స్థలం మెరక చేయడం అధికారుల తీరుపై అనుమానాలు రేకెత్తిస్తోంది. దీనిపై ఆర్ఐ శివశంకర్ స్పందిస్తూ సొంత భూమిలో నుంచి సొంత స్థలంలోనికి మట్టి తోలేందుకు అనుమతులు పొందారని, అయితే భూ బదలాయింపు జరగలేదన్నారు. విచారణ చేపడతామని పేర్కొన్నారు.

అడంగల్‌లో పేరు మాయంపై ఫిర్యాదు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): అడంగల్లో గతంలో ఉన్న పేరు మాయమయిందని రైతు కేతరాజు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు సర్పంచ్ అరజా సంధ్యారాణి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో సర్వే నంబరు 644/3లో అడంగల్లో ఉండాల్సిన తన పేరు మాయమయిందని, 812/2లో 1.35 ఎకరాల తన భూమిని ప్రభుత్వ భూమిగా సూచిస్తుందని శ్రీనివాసరావు అనే రైతు ఫిర్యాదు చేశారు.

అంధుల మనసుల్లో బ్రెయిలీ చెరగని ముద్ర

పెడన: అంధుల మనసుల్లో, వారి మునివేళ్లలో చిరకాలం జీవిస్తూనే ఉండేది లూయిస్ బ్రెయిలీ అని, వారి మనస్సుల్లో చెరగని ముద్ర వేశారని ఎంఈవో–2 వై హరనాథ్ అన్నారు. అంధుల అక్షరశిల్పి లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని మండలం పరిషత్ ప్రాథమిక పాఠశాల (బంగ్లా స్కూల్)లోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో–2 మాట్లాడుతూ అంధులకు పత్రికలు, పుస్తకాలు, బ్రెయిలీ లిపి లోనే వస్తున్నాయని చెప్పారు. తద్వారా ఎంతో మందికి విద్యాదానం చేసిన చిరస్మరణీయుడు బ్రెయిలీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహిత రిసోర్స్ పర్సన్లు (ఐఈఆర్పీలు) అబ్దుల్ హమీద్, రమ్య, పాఠశాల హెచ్‌ఎం ఎ.భాగ్యలక్ష్మి, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ దినోత్సవం



శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కృత్తివెన్ను: మండలంలోని నీలిపూడి గ్రామంలో ఉన్న భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు శంకరరావులు బ్రెయిలీ ప్రాముఖ్యత, అంధత్వం దాని పర్యవసానాల గురించి వివరించారు. బ్రెయిలీ జీవిత చరిత్ర గురించి, లూయిస్ బ్రెయిలీలో రాసే ప్రక్రియను ఐఈఆర్పీ వరుణ్‌బాబు ప్రదర్శించారు. బ్రెయిలీ రచనలు, జీవనశైలి నుంచి ప్రేరణ తదితర అంశాలను సీఆర్‌సీ తంబి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పాశం సత్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

శ్రీకాకుళం(ఘంటసాల): చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ అని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం భవితా కేంద్రం, ఎంపీపీ స్కూల్లో అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ జయంతి, అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధుల కోసం లూయిస్ బ్రెయిలీ తయారు చేసిన అక్షరాలు, ఆయన జీవిత చరిత్ర గురించి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టి.నాగ బాబు, ఐఈఆర్పీలు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే దేవాలయాల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: వైఎస్సార్ సీపీ హయాంలో నీతి, నిజాయితీగా పనిచేయడం వల్లే దేవాలయాల అభివృద్ధి సాధ్యమయిందని అవనిగడ్డ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో మోపిదేవి దేవస్థానంలో అనేక అవకతవకలు జరగాయని, వాటిపై విచారణ చేయిస్తానని ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేడు దేవస్థానం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్న విమర్శలపై ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి దేవస్థానం కార్యనిర్వహణాధికారి దాదాపుగా రూ. 15 కోట్లు ఆదాయం సమకూర్చారని చెప్పారు. తాము ఎంతో చిత్తశుద్ధితో పనిచేయడంతోనే రెండేళ్ల వ్యవధిలోనే రూ. 15 కోట్లు డిపాజిట్ సాధించామని గుర్తు చేశారు. పెదకళ్లేపల్లి శ్రీదుర్గా నాగేశ్వరస్వామివారి దేవస్థానంకు రూ. 1.30 కోట్లు, శ్రీకాకులేశ్వరస్వామివారి దేవస్థానం అభివృద్ధికి రూ. 1.30 కోట్లు అభివృద్ధికి కేటాయించగా, ప్రస్తుతం వాటి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆలయ భూమి విషయంలో హైకోర్టు తీర్పు మేరకు 7.59 ఎకరాలు ఉండాల్సి ఉండగా, జిల్లా సర్వేయర్ ఇటీవల సర్వే చేసి 4.80 ఎకరాలు అధికారికంగా గుర్తించారని వివరించారు. కనీసం ఆ భూమినైనా కాపాడుతున్నారా అంటే అదీ లేదన్నారు. ఎమ్మెల్యేకు సంబంధించిన వారికి కొంత మేరకు భూమి వదిలివేసారని ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని తెలిపారు. అందులో వాస్తవాలు ఏమిటో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. బుద్ధప్రసాద్ చెప్పే మాటలకు చేసే పనులకు సంబంధం లేదన్నారు. పులిగడ్డ ఆక్విడక్ట్ దగ్గర ఎమ్మెల్యే కనుసన్నల్లో తవ్వకాలు జరుగుతున్నాయని చెప్పారు. తవ్వకాలు పూర్తయిన తర్వాత తహసీల్దార్, ఎస్ఐలను పిలిచి అక్రమ ఇసుక తవ్వకాలు జరిగితే ఊరుకోను అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడబత్తిన పూర్ణచంద్రరావు, లింగం జగదీష్ కుమార్, గరికిపాటి గోవిందరాజులు, బచ్చు దిలీప్, జన్యావుల రామోహనరావు, రెడ్రొత్తు వెంకటరమణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థులకు వడ్డించి వారితో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధే ధ్యేయంగా మంత్రి నారా లోకేష్ ఎన్నో సంస్కరణలు తీసుకొస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ప్రిన్సిపాల్ ఎన్‌వి నరసింహారావు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు మత్తి శ్రీనివాసరావు, గుడిసేవ విష్ణుప్రసాద్, నక్కా విజయ్‌బాబు, హైస్కూల్ హెచ్‌ఎం జి.గోపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: ప్రభుత్వ పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలలో కూడా ప్రభుత్వం చేపట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ప్రభుత్వం డొక్కా సీతమ్మ పథకంగా జూనియర్ కళాశాలలో చేపట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్ వి.కృష్ణవేణి, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, టీడీపీ నాయకులు కె.వీరబాబు, ఈ.లీలాకృష్ణ, ఎ. రంగనాథ్, డీసీ చైర్మన్ కాశీ, ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న బుద్ధప్రసాద్

చిట్టూర్పులో 2.25 ఎకరాల వరి కుప్ప దహనం

చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలో 2.25 ఎకరాల వరికుప్ప దహనమైన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లుపెద్ది కృష్ణశ్రీకి చెందిన పొలాన్ని చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామానికి చెందిన మట్టా విజయరాజు కౌలుకు చేస్తున్నాడు. ఇటీవల కోతలు కోసి వరి కుప్ప వేయించగా శనివారం ఉదయం వరి కుప్పలో నుంచి మంటలు రావడం గమనించిన స్థానికులు విజయరాజుకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న విజయరాజుతో పాటు పరిసర ప్రాంతాల రైతులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అవనిగడ్డ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఘంటసాల పోలీసులు, చిట్టూర్పు వీఆర్వో సాయిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా చిట్టూర్పు గ్రామంలో ఎప్పుడు ఇలాంటి సంఘటనలు జరగలేదని, ఇదే మొదటిసారని స్థానికులు చెప్పారు. ఎవరో కావాలని వరికుప్పకు నిప్పుపెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితులు గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పకు నిప్పు పెట్టారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘంటసాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కోడూరు రహదారి నిర్మించాలని పాదయాత్ర

కోడూరు: కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణాన్ని చేపట్టాలంటూ ఈ నెల 7న సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పి.మోహనరావు తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కోడూరు నుంచి అవనిగడ్డకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాలకులు రహదారి నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడంపై మండిపడ్డారు. గతంలో రహదారి నిర్మాణం చేయాలని టీడీపీ, జనసేన పార్టీ నేతలు కోడూరు నుంచి అవనిగడ్డకు పాదయాత్ర చేశారని, కానీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా కూడా రహదారి నిర్మించకపోవడం ఏంటని ప్రశ్నించారు. రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ ఈ నెల 7న కోడూరు నుంచి అవనిగడ్డకు 13 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు.

జలధీశ్వరస్వామి సేవలో...

ఘంటసాల: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాలలో వేంచేసియున్న బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ అసిస్టెంట్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్) అధికారి ఆర్.శ్రీనివాసరెడ్డి, మల్లేశ్వరి దంపతులు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ జలధీశ్వర ఆలయం ప్రాచీన చరిత్ర వివరించి స్వామి వారి జ్ఞాపిక అందించి శేషవస్త్రంతో సత్కరించారు. దేవస్థానం చరిత్ర పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఏసీఎఫ్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో ప్రాచీన చారిత్రక ఆలయాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన ఘంటసాలలో అగస్త్య మహామునిచే ప్రతిష్ఠించబడి ఏకపీఠంపై కొలువైన బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో దర్శించుకోవడానికి రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాగాయలంక డీఆర్‌ఓ శ్రీనివాసరావు, అర్చకులు ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ప్రొటోకాల్ పాటించాలి

మోపిదేవి: పార్టీలకతీతంగా అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించాలని కోరారు. నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన కొళాయిలకు పూర్తి స్థాయిలో మంచినీరు అందించాలని కోరారు. విద్యుత్ పోల్స్ వేసి వాటికి కనెక్షన్ ఎందుకు ఇవ్వడం లేదని అధికారులను నిలదీశారు. కోసూరువారిపాలెం శివారు గొల్లపాలెం, ఎస్సీ కాలనీల్లో ప్రత్యేకంగా వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు మాట్లాడుతూ రెండు సీసీ రోడ్లు తనకు తెలియకుండా వేరే వారికి కాంట్రాక్ట్‌లు ఇవ్వడం ఆశ్చర్యం కల్గించిందన్నారు. మండల కో–ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, జననీకుమారీ, ఎంపీడీఓ జె.స్వర్ణభారతి, ఏవో పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పెడన: భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 ఏడాది పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. పెడన– గుడివాడ ప్రధాన రోడ్డులోని షాదీఖానాలో ఈ పూర్వ విద్యార్థుల ఆపూర్వ కలయికతో ఆనాటి మధుర జ్ఞాపకాలను పంచుకుని ఆనందభరితులయ్యారు. ఈ బ్యాచ్‌లో అమెరికాలో ఉద్యోగరీత్యా స్థిరపడిన డాక్టర్ మొహమ్మద్ అన్వర్ అలీ, పులి బాలసుబ్రహ్మణ్యంలు కూడా హాజరవ్వడంతో వీరిని మిగిలిన పూర్వ విద్యార్థులందరూ శాలువాలతో సత్కరించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కారం

మచిలీపట్నంటౌన్: నగరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల జరిగిన పవర్ లిఫ్టింగ్, కర్రసాము పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి గోల్డ్ మెడల్స్ పొందారు. వీరిద్దరిని లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించి నగదు బహుమతి అందజేశారు. బాలసాయి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కొల్లా హర్షిత్ సాయి ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ 11వ రాష్ట్ర వ్యాప్త పోటీల్లో పాల్గొని జూనియర్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి వచ్చే వారం చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా సన్మానించారు. లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విశ్వనాథపల్లి శ్రావణి నెల్లూరులో జరిగిన కర్రసాము పోటీల్లో రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ పొంది, జాతీయ స్థాయిలో వివిధ విభాగాల్లో రెండు గోల్డ్ మెడల్స్, ఒక వెండి పతకం సాధించిన సందర్భంగా శ్రావణిని సన్మానించారు. ఈ సందర్భంగా లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ కన్వీనర్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడారు. రిటైర్డ్ ఎడిషనల్ ఎస్పీ శాయన సుశీలరావు, సువర్ణ రాజు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.మెటిల్డారాణి, న్యాయవాది వెంకట నాగరాజు పాల్గొన్నారు. హర్షిత్‌సాయి, శ్రావణిలను శాలువాలతో సన్మానించి రూ. 2 వేలు చొప్పున, విశ్రాంత అడిషనల్ ఎస్పీ సుశీలరావు రూ. 2 వేల చొప్పున నగదు అందజేశారు.